ప్రజాశక్తి

గురువారం 16 నవంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంధాలయంలో రెండవ రోజు బుధవారం పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. గ్రంధాలయంలో నున్న వివిధ రకాల కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన పుస్తకాలతో పాటు వివిధ రకాల పుస్తకాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వైవివిఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రంధాలయాలు విజ్ఞాన దేవాలయాలు వంటివని, బాగా కష్టపడి చదివే విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతిరోజు విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత పాల్గొన్నారు.

పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఆగని అక్రమ కట్టడాలు

-అధికారులు హెచ్చరించినా పట్టించుకోని గిరిజనేతరులు

ప్రజాశక్తి -హుకుంపేట:మండల కేంద్రంలోని రోజు రోజుకి అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను ధిక్కరించి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల సెలవు రోజులు చూసుకొని మరుసటి రోజు కల్లా శ్లాపులు నిర్మాణాలు చేపడుతున్నారు. గత నాలుగు రోజులుగా దీపావళి సెలవు కావడంతో గిరిజనేతరులు పెట్రేగి పోతున్నారు. మండలం కేంద్రలోని రాళ్ళు గెడ్డ సమీపంలో అక్రమ కట్టడాలను రాజు అనే వ్యక్తికి చేపడుతున్నాడు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టకూడదని, నిలుపుదల చేయాలని స్థానిక తహసిల్దార్ రాజ్యలక్ష్మి మంగళవారం హెచ్చరించారు.అయినా బుధవారం శ్లాబ్ వేయడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడారు. నిబంధనలకు విరోధంగా చేపడుతున్న నిర్మాణాలను ప్రభుత్వ పరంగా చర్యలకు తప్పవని ఆమె పేర్కొన్నారు. అక్రమణదారులకు పలుమార్లు నిలుపుదల చేయాలని హెచ్చరించినా అధికారులు లేని పక్షంలో నిర్మాణం చేసుకుంటున్నారని ఆమె అన్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టికి తెలియజేస్తామన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న భవనం

చేపడుతున్న శ్లాబ్ నిర్మాణం

అక్రమ నిర్మాణాలు అధికారుల కనుసున్నల్లోనే జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు తెలిపారు. పునాది లెవెల్‌లో ఉన్నప్పుడు ఫిర్యాదు చేసినా ఒక్క అక్రమ నిర్మాణం నిలుపుదల చేయలేదన్నారు. నిర్మాణం చేపట్టిన వారిపై ఎస్టీఆర్ కేసు ఒక్కటి కూడా నమోదు చేయలేదని ఆయన మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన ఏ ఒక్క కట్టడాన్ని కూడా నిలుపుదల గాని ఎస్టీఆర్ కేసు గాని నమోదు చేసిన పాపాన పోలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు మేల్కొని అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మనుగడ లేకుండా పోతుందన్నారు. నిర్మాణాలు నిలుపుదల చేసి నిర్మాణం చేపట్టిన వారిపై ఎస్టీఆర్ కేసు నమోదు చేసి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలకు కాపాడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో గిరిజనులందరూ ఏకమై అక్రమ నిర్మాణాలు కూల్చడానికి పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

విజేతలను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాలు

ప్రజాశక్తి -కొయ్యూరు

ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో కొయ్యూరు మండలం కాకరపాడు జూనియర్ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి.మహేష్ అండర్-19లో 57 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో గోల్డ్ మెడల్, పి.రమేష్ 60 కేజీల ఫ్రీ స్టైయిల్ విభాగంలో గోల్డ్ మెడల్, అండర్- 17లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.దారవీర ప్రసాద్ 55 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. వీరు ముగ్గురు డిసెంబర్‌లో ఢిల్లీలోని ఛత్రశాల స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న జె.జీవన కుమార్ 67 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ పతకం, జి.చంటి 60 కేజీల గ్రీకు రోమన్ విభాగంలో తృతీయ స్థానంలో కాంస్య పతకం సాధించారు. వీరు ఐదుగురిని కళాశాల ప్రిన్సిపాల్ పి.సూరిబాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది బుధవారం అభినందించారు.

బిర్సా ముండా పోరాట యోధుడు

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అరకు లోయ, అరకురూరల్, అనంతగిరి:బిర్సా ముండా పోరాట యోధుడని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా జన్ జాతీయ గౌరవ్ దివస్, విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని అరకులోయలో గవర్నర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ మరువ లేనిదన్నారు. ఈ సందర్భంగా మారుమూల పిహెచ్‌సి ధారకొండకు రెడ్ క్రాస్ అందజేసిన అంబులెన్స్ ను గవర్నర్ ప్రారంభించారు.అనంతరం వన్ ధన్ మార్ట్, జిసిసి, ఉజ్వల యోజన, సికిల్ సెల్ అనీమియా పరీక్ష కేంద్రం, చాయాచిత్ర ప్రదర్శన స్టాళ్లను తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ కు ఐటిడిఎ తరపున జ్ఞాపికను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి , పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి బూడి ముత్యాల నాయుడు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జల్లిపల్లి సుభద్ర, అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ, పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు మురళి, సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎఎస్పి ధీరజ్, జిసిసి చైర్పర్సన్ శోభ స్వాతి రాణి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు రామలక్ష్మి, లిల్లీ సురేష్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ సహాయ సంచాలకులు మహమ్మద్ సఫి, ట్రైకార్ డైరెక్టర్ ఇ.రవీంద్రబాబు, ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారులు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, డిఆర్ఓ పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

కొయ్యూరు :స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి వేడుకలు కొయ్యూరు ఏకలవ్య మోడల్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జగన్నాథరావు, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, శంకరరావు, సత్యనారాయణ, తమ్మారావు, గోవింద్ తదితరులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగన్నాథరావు మాట్లాడుతూ, దేశంలో ఆదివాసీ హక్కుల కోసం తొలి పోరాటయోధుడు బిర్సాముండా అని కొనియాడారు.

మారేడుమిల్లి : రంప చోడవరం మండలం ఇర్లపల్లి గ్రామంలో బిర్సా జయంతిని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చవలం రాంబాబు దొర, పూసం బాలు దొర, సిహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని పట్టుచీర గ్రామంలో బిర్సా ముండా చిత్ర పటానికి ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కుంజా శ్రీను, కణితి మధు, పాయం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండాకు నివాళులర్పిస్తున్న గవర్నర్, మంత్రులు

మంచుదట్టంగా కమ్మేసి పాలసముద్రాన్ని తలపిస్తున్న దృశ్యం

మన్యంలో మంచు అందాలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారాలమ్మ ఘాట్ రోడ్‌లో మంచు అందాలు మైమరిపిస్తున్నాయి. సప్పర్ల, దారకొండ ఘాట్ రోడ్లో బుధవారం తెల్లవారుజాము నుంచి మంచు దట్టంగా కురువడంతో ఎత్తయిన కొండల నడుమ తెరచాపలా కుమ్మేసిన మంచు అందాలు, దారకొండ ఆలయం సమీపంలో ఉన్న రెండు కొండల నడుమ జాలవారే జలపాతాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి. జీకే వీధి నుంచి సీలేరు వరకు రహదారి పొడవున మంచు అందాలు ఆవిష్కృతం కావడంతో పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించారు. రెయిన్ గెజ్ దగ్గర కాశ్మీర్‌ని తలపించే మంచు సోయగాలు పర్యాటకులకు కనువిందు చేశాయి. ఈ ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా నుండి పర్యాటకులు వస్తూ ఉంటారు.

22న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి- కొయ్యూరు

కొయ్యూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, బాధిత రైతులను ఆదుకోవాలని టీడీపీ సీనియర్ నాయకునలు కాకురు బాలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.మాకవరం రైతులతో కలిసి గ్రామ శివారులలో పంట పొలాలను పరిశీలించారు. వరిపంట పొట్ట ఉన్న సమయంలో వర్షాలు లేక వరిచేను పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ఎండిపోయిన పొలాల్లో పగుళ్ల ఏర్పడ్డాయని, వరి చేను చచ్చి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తాత్కాలిక డిపోలకు కలప తరలింపు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చింతాలమ్మ ఘాట్ రోడ్డులో నేషనల్ హైవే 516 విస్తరణలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేయగా, ఫారెస్ట్ సిబ్బంది ఆ కలపను కాకరపాడు కాలనీ దగ్గర ఏర్పాటు చేసిన తాత్కాలిక డిపోకు తరలిస్తున్నారు. సెక్షన్ ఆఫీసర్ సింహాద్రి, బీటు ఆఫీసర్ రాకేష్, వాచర్ దుర్గాప్రసాద్ తదితరుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. కలప మొత్తం డిపోకి చేర్చిన తర్వాత ఆక్షన్ నిర్వహిస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -సీలేరు

వైసిపి బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని జికె.వీధి ఎంపిపి బోయిన కుమారి, పార్టీ మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండలంలోని దారకొండలో వైసిపి జెండాను ఎంపీపీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలన్నారు. 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సీఎం పీఠాన్ని ఎక్కేలా కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.రాజు, దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, కార్యదర్శి శ్రీనివాస్, పిల్ల బుజ్జి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

బాకూరులో పశు విజ్ఞాన బడి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బాకూరు పంచాయితీ బాకూరు కోటగుమ్మం గ్రామంలో పశు విజ్ఞాన బడి ఏర్పాటు చేశారు. కోళ్లకు వైద్య పరీక్షలు చేయడం జరిగిందని పశువైద్యాధికారి వర ప్రసాద్ పేర్కొన్నారు.రైతులకు సీజనల్ వ్యాధులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణపై వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. నాటుకోళ్లకు డిమాండ్ ఉందని, ప్రతి రైతు కూడా వీటి పెంపకం చేపడితే మంచి లాభాలు పొందవచ్చునని రైతులకు వివరించారు. అనంతరం బాకూరు, కోటగుమ్మంలో సుమారు మూడు వందల కోళ్లకు వాక్సినేషన్ చేశారు.గోట్ పాక్స్ వ్యాక్సిన్ గొర్రెలు, మేకలకు చేశారు. ఈ కార్య క్రమంలో పశు సంవర్ధక సహాయకులు దొన్ను, బాలన్న, బుజ్జిబాబు, సోమ, సన్యాసిరాజు, శేఖర్, సునీల్, పద్మ,సౌదమిని పాల్గొన్నారు.

దగ్ధమైన వరి కుప్పలు

దుక్కగుడలో వరి కుప్పలు దగ్ధం

బాధిత రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి- అరకు లోయ :మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దుక్కగుడ గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో ధాన్యం కుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలోని కలంలో దాన్యం కుప్పలు ఉన్నాయి. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుని ఆహుతి అయ్యాయి. తెల్లారేసరికి కలం వద్దకు వెళ్లి చూడగా, ధాన్యం కుప్పలంతా ఖాళీ బూడిదై ఉండడాన్ని గమనించిన రైతులు బోరున విలపించారు. చిట్టెమ్ నాయుడు గురుమూర్తి, కుర్ర కొండ, కొర్రా రాము, పొట్టంగి మొద్దు అనే గిరిజనులకు చెందిన వరి కుప్పలు దగ్ధమైనట్లు సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గమ్మెలి చిన్నబాబు, సిపిఎం మండల కార్యదర్శి రామారావులు విలేకరులకు తెలిపారు. వరి కుప్పలు సుమారు 150 బస్తాల ధాన్యం కోల్పోయినట్లు బాధితులు విలపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదంతా కాయ కష్టం చేసి పండించిన పంట అగ్నికి ఆహుతి అయి సర్వం కోల్పోయారని, ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు కోరారు.

క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జెకెసి ట్రస్టు ఆధ్వర్యాన ప్రముఖ వనమూలికల వైద్యులు జమాల్ ఖాన్ చేతుల మీదుగా బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లాంగ్ జంప్ కోర్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జమాల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అనేక మంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మేధావులు శాస్త్రవేత్తలుగా కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్నారని తెలిపారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువు నిమిత్తం తమ జెకెసి ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తామని చెప్పారు. అనంతరం ఎంఇఒ, విద్యా కమిటీ చైర్మన్ పాఠశాల సిబ్బంది జమాల్ ఖాన్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెకెసిటి కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, అడ్వైజర్ కమిటీ సభ్యులు సయ్యద్ సుబహాని, విద్యా కమిటీ చైర్మన్ ఎండి జిక్రియా, ఎంఈఓ వి లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.సుబ్బయ్య, ఎ.రమేష్, కే నాగరాజు, కే.స్వాతి, పెంటమ్మ, కే.భద్రయ్య, జి.రాజు, రత్తయ్య, ప్రసాదరావు, శ్రీనివాస్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాన్

జనసేనలో గ్రూపుల గోల

- ఆత్మీయ సమావేశంలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై ఒక వర్గం ఆగ్రహం
- పరుచూరి భాస్కరరావుకు వ్యతిరేకంగా నినాదాలు

నిలదీస్తున్న జనసేన నేతలను సముదాయిస్తున్న టిడిపి నేత పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి

జనసేన పార్టీలో గ్రూపుల గోల మొదలైంది. తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు బుధవారం స్థానిక ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం కొద్దిసేపు రసాభాసగా మారింది. ఈ సమావేశంలో టిడిపికి చెందిన కొందరు నాయకులు, జనసేన పార్టీ నుంచి ముగ్గురు నాయకులు మాట్లాడేందుకు అవకాశం ఆయా పార్టీలు ఇచ్చాయి. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు ముగ్గురికే అవకాశం ఇవ్వడంతో ఆ పార్టీలో మరో గ్రూపునకు చెందిన దూలం గోపి, మల్ల శ్రీను, తాడి రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ముందు నుంచి పనిచేస్తూ, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం ఏమిటనీ వారు పరుచూరిని ప్రశ్నించారు. పరుచూరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు సర్దిచెప్పగా, ఇంతలో పరుచూరి మైకు పుచ్చుకొని తమకు ఇష్టమైన వారిని మాట్లాడిస్తామని చెప్పడంతో తిరిగి దూలం గోపి గ్రూపు ఒక దశలో పరుచూరి భాస్కరరావుపైకి దూసుకు వెళ్లారు. ఎట్టకేలకు టిడిపి నాయకులు సర్ది చెప్పి సమావేశం కొనసాగించగా, పరుచూరికి వ్యతిరేకంగా జనసేన రెండో గ్రూపు నినాదాలు చేస్తూనే ఉంది. మొదటి ఆత్మీయ సమావేశంలోనే జనసేనలోని ఇరు గ్రూపులు బాహాబాహీకి దిగడంతో భవిష్యత్తులో జరిగే సమావేశాలు, కార్యాచరణ ఏ విధంగా ఉంటుందోనని ఇరువర్గాలు ఆందోళనలో ఉన్నాయి.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా కార్యాచరణ రూపొందించినట్లు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖరరావు కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని టిడిపి జనసేన కలిసి పని చేస్తున్నాయన్నారు. టిడిపి, జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పీలా గోవింద సత్యనారాయణ, పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయంతో అధికారం చేపడతామన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలబాబు, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, కాయల మురళి, జనసేన నాయకులు దూలం గోపి, పావడ కామరాజు, పల్లెల గణేష్, బుదిరెడ్డి చిన్న పాల్గొన్నారు.

ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి బుక్ హౌస్‌లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యాన డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను బుధవారం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఈ నెల 21వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ప్రదర్శనలో పిల్లలకు సంబంధించి సైన్సు, చరిత్ర, కథలు తదితర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని తల్లిదండ్రులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శన సందర్భంగా పుస్తకాలపై 10 నుంచి 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ ఇన్‌ఛార్జి ఎన్.శంకరరావు, రాజేష్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాజేష్, సంతోష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్‌కె.బీచ్‌లో ఏర్పాటుచేసిన స్క్రీన్‌పై క్రికెట్ సెమీఫైనల్‌ను తిలకిస్తున్న అభిమానులు

సెమీ ఫైనల్ సందడి

-ఆర్‌కె బీచ్‌లో జంబో స్క్రీన్ - వీక్షించిన క్రికెట్ అభిమానులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ప్రపంచ కప్ క్రికెట్-2023లో భాగంగా బుధవారం ఇండియా - న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏసిఏ ఫ్యాన్ పార్క్ పేరుతో ఆర్‌కె.బీచ్ వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏసిఏ కార్యదర్శి మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్ క్రికెట్ అభిమానులంతా వీక్షించాలనే ఉద్దేశంతో విశాఖపట్టణంతో పాటు విజయవాడ, తిరుపతిలలో భారీ తెరలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ ప్రయత్నానికి క్రీడాభిమానులు నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. సుమారు 10 వేల మంది బీచ్‌లో మ్యాచ్ వీక్షించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే బీచ్ రోడ్డుకు భారీగా అభిమానులు చేరుకుని ఎంతో ఉత్సహంగా కేరింతలు కొడుతూ మ్యాచ్‌ను వీక్షించారు. ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సుమారు 400 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

టిడిపి, జనసేన నేతల సమావేశం

ప్రజాశక్తి-మాడుగల: తెలుగుదేశం, జనసేన నియోజకవర్గ నేతల ఆత్మీయ సమావేశం మాడుగులలో నిర్వహించారు. జనసేన తెలుగుదేశం పార్టీలు కలిసి అధికారంలోకి వస్తుందని జనసేన పార్టీ సమన్వయకర్త రాయపు రెడ్డి కృష్ణ తెలిపారు. తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి.వి.జి కుమార్, పైలా ప్రసాదరావు, మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, పాల్గొన్నారు.

పార్కులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఆటస్థలాలు...

కాదేదీ ప్రయి'వేటు'కు అనర్హం

జివిఎంసి, విఎంఆర్‌డిఎ రెంటిదీ అదే బాట

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలో సామాన్యులు, మధ్యతరగతి ప్రజానీకానికి ఆటవిడుపు కలిగించే పార్కులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఆటస్థలాలు, చిల్డ్రన్ ఎరీనా ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ ప్రయివేట్ ఆపరేటర్లకు వదిలేస్తున్నారు. ప్రజానీకాన్ని సైతం టూరిస్టులుగా చూసే విఎంఆర్‌డిఎ, జివిఎంసి అధికారుల దృష్టి కోణంతో అన్నిటికీ 'ఫీజుల' మోత మోగించేందుకు సిద్ధమవుతున్నారు. కూర్చొన్నా, చూసినా, ఆటలాడినా దేనికైనా వెల కట్టి జనం నుంచి వసూలు చేసే ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ప్రయివేట్ వారికి లీజు పేరుతో ఒక్కొక్కటీ ధారాదత్తం చేయడంతో ఉచితంగా విశాఖ ప్రజలు సేదతీరడం, ఆహ్లాదకరంగా జీవించే పరిస్థితి సమీప భవిష్యత్‌లో కానరావడం లేదు. ఇప్పటికే నగర జీవిపై ఆర్థిక భారాలను జివిఎంసి మోపుతోంది. యూజర్ ఛార్జీలు, ఆస్తిపన్నుల పేర అధిక వసూళ్లకు పాల్పడుతోంది. విశాఖ సాగర తీరంలో ఆహ్లాదంగా గడిపేందుకు ఇక్కడ సహజ సంపదలను తిలకించేందుకు విశాఖ వాసులే కాకుండా ఉత్తరాంధ్ర, ఏపి, తెలంగాణ, ఉత్తరాది నుంచి భారీ సంఖ్యలో నిత్యం వస్తూంటారు. వారు ఎంతో కొంత చూసేందుకు ఎంట్రీ ఫీజులు, ఇతరత్రా ఏదైనా అన్నీ చూసుకుని తిరిగి తమ ప్రాంతాలకు వెళుతుంటారు. వీరి నుంచి విశాఖకు చాలా ఆదాయం లభిస్తూనే ఉంది. జివిఎంసి స్థాయీ సంఘ సమావేశాల్లో కొద్దిమంది అధికార పార్టీ సభ్యులు వీటిపై నిర్ణయం తీసుకుంటూ ఫీజుల మోతకు అంగీకరించడంపై 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఇప్పటికే తన అభ్యంతరాన్ని కమిషనర్, మేయర్‌కు వినతిపూర్వకంగా తెలియజేశారు. కానీ అధికార పార్టీ ఏం నిర్ణయిస్తే అది అమలైపోవడం నగర ప్రజలకు ఆశనిపాతంలా మారింది.

ప్రయివేటీకరణతో ఎంట్రీ ఫీజుల ఒత్తిడి..

నగరం నడిబొడ్డున సెంట్రల్ జైల్ (పాత) రోడ్డు వద్ద గల సిటీ సెంట్రల్ పార్కును విఎంఆర్‌డిఎ ప్రయివేట్‌కు పూర్తిగా వదిలేసింది. దీంతో మొదలైన ఫీజుల మోత నేటికీ మోగుతూనే ఉంది. తర్వాత ఎంవిపిలో రూ.20కోట్లతో నిర్మితమైన ఇండోర్ స్పోర్ట్స్ ఆడిటోరియాన్ని ఐదేళ్ల పాటు ప్రయివేట్ సంస్థకు కట్టబెట్టారు. రూ.వేలకు వేలు నెలవారీగా ఇక్కడ వసూళ్లు చేస్తున్నారు. ఈత కోసం ఆరాటపడి ఇక్కడకెవరైనా వెళితే రూ.6వేలకు పైగానే ఫీజు చెల్లించాల్సిందే. షటిల్‌బ్యాడ్మింటన్ ఇతరత్రా అన్ని ఆటలకూ భారీ ఎత్తున వసూళ్లు చేస్తున్నారు. నిర్వహణ పేరుతో ఈ భారాలన్నీ జనంపై మోపుతున్నారు. రూ.వేల కోట్లు జివిఎంసికి నగర ప్రజల నుంచి పన్నులు, ఇతరత్రా ఆదాయం లభిస్తున్నా ఇంకా ఆర్థికంగా ప్రజలపై జరిమానాలు వేసేందుకే పాలకులు ఆరాటపడుతున్నారు. వుడా చిల్డ్రన్ ఎరీనాకు ఇదే గతి విఎంఆర్‌డిఎ పట్టించింది. తాజాగా ఆర్‌కెబీచ్‌లో జివిఎంసి ఆధునీకరించిన ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ ఈతకొలనును బిఎస్ కెమికల్స్ సంస్థకు మూడేళ్లపాటు లీజుకు ఇచ్చేశారు. ఇక్కడ ఇప్పటికే ఫీజుల మోత ఉంది. ప్రయివేట్ ఆపరేటర్ల రంగ ప్రవేశంతో ఇంకా ఫీజులు పెరగనున్నాయని నగర ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎండాడ పార్కును రూ.40లక్షలతో అభివృద్ధి చేశారు. గేట్లు, ఫెన్సింగ్ వేశారు. త్వరలో ఇక్కడ ఎంట్రీ ఫీజులు నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది. తెన్నేటిపార్కు, ఉడా పార్కు, కైలాసగిరి, తొట్లకొండ, ఫీజుల మోత మోగుతోంది. ఆఖరికి నూతనంగా నిర్మించిన టిటిడి కొండకు వెళ్లాలన్నా దిగువ వాహనాలకు ఫీజులు చెల్లించి వెళ్లాల్సిందే. నగరంలోని జనావాసాల్లో పలు పార్కులను జివిఎంసి, విఎంఆర్‌డిఏ ఏళ్లతరబడి వదిలేసిన వైనాలూ ఉన్నాయి. వీటిని స్థానిక అధికార పార్టీ నేతలు ఎక్కడికక్కడ కబ్జా చేసేయడం ఆనవాయితీగా మారిపోయింది. రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడ తదితర చోట్ల ఇలాంటి పార్కుల ఆనవాళ్లు కూడా లేకుండా కబ్జాలకు గురౌతున్నాయి. ఫీజులపై దృష్టికంటే వీటిని నగరపాలకులు పరిరక్షిస్తే రూ.కోట్ల ఆదాయం జివిఎంసి, విఎంఆర్‌డిఎకు లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ కేవలం 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని పోర్టు అథారిటీ కార్యదర్శి టి. వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండిల్ చేసేందుకు 251 రోజుల సమయం పట్టిందని పేర్కొన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీలోని నిబద్ధతతో కూడిన సిబ్బంది, పిపిపి ఆపరేటర్లు, వ్యాపార భాగస్వాముల సహకారంతో పోర్టు ఈ ఘనతను సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్, అతని సిబ్బందిని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రత్యేకంగా అభినందించారు. అంకిత భావంతో పనిచేసి 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 83 మిలియన్ మెట్రిక్ టన్నుల హ్యాండ్లింగ్ రికార్డును చేరుకోవాలని సూచించారు.

కెజిబివిని సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక కెజిబీవీ పాఠశాలను బుధవారం ప్రాంతీయ విద్యా సంచాలకులు జ్యోతికుమారి ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి స్టడీ అవర్స్ పై చర్చించారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలడిగి సంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. స్టడీ అవర్ టీచరు కన్యాకుమారిని అభినందించారు. లిప్ అమలవుతున్న తీరు పరిశీలించి చిన్నారులకు పలు సూచనలు చేశారు. శతశాతం పదిలో ఫలితాలు తీసుకు రావాలన్నారు. ఇదే కళాశాలలో పది పూర్తయిన తరువాత చదువుకునే పిల్లలెంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థుల నోట్స్‌లు పరిశీలించారు. వీరి వెంట మండల విద్యాశాఖాధికారి కె.నరేష్, ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, సి.ఆర్.పి డి.అప్పారావు తదితరులు ఉన్నారు.

ఏచూరి దృష్టికి హెటిరో పైప్‌లైన్ సమస్య

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో పైప్ లైన్ సమస్య ను సిపిఎం అఖిల భారత ప్రదాన కార్యదర్శి సీతారాం ఏచూరి దృష్టికి తీసుకు వెళ్లినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు ఏచూరి విచ్చేయడంతో ఆయనను కలిసి హెటిరో పైప్‌లైన్‌పై వినతి పత్రం అందజే శామన్నారు. కొత్త పైపులు ఏర్పాటు చేయడంతో మత్స్యకారులకు కలుగు ఇబ్బందులను, నష్టాలను ఆయన దృష్టికి తీసుకు వెళ్ళమన్నారు. ఎన్‌జిటిలో కేసు విచారణలో ఉండగా అన్ని అనుమతులు లేకుండా, చట్టాలను ఉల్లంఘించి కంపెనీ యాజమాన్యం రెండవ పైప్లైన్ పనులు ప్రారంభించిందని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు .వినతి పత్రం అందజేసిన వారిలో మండల కార్యదర్శి ఎం.రాజేష్, రాజయ్యపేట శాఖ కార్యదర్శి ఎం.మహేష్ బాబు తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: డ్వాక్రా రుణాలు తీసుకుని పతి మహిళ ఆర్థిక వ్యాపారంతో స్థిరపడాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి సూచించారు. బుధవారం ఆమె వెలుగు కార్యాలయం వద్ద సీసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ఆర్థిక అక్షరాస్యత పట్ల దృష్టి సారించాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, ఫండింగ్ వెరిఫికేషన్ లోకాస్ యాప్‌పై రివ్యూ నిర్వహించారు. అర్హత కలిగిన వారందరికీ రుణాలు సకాలంలో అందించడంతో పాటు సభ్యులందరికీ బ్యాంకు రుణాలు ఖాతాలో నిల్వల పట్ల ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి కోఆర్డినేటర్ కరుణానిధి, ఏపీఎం పలువురు సీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల: సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని బుధవారం మండల సమావేశ మందిరంలో సిడిపిఓ శ్రీవిద్య పిహెచ్సి వైద్యులు, ఎంఈఓ రామారావు ఆయా శాఖల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, చిన్నారులు, బాలింతల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది సచివాలయ సిబ్బంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాలతో మెరుగైన సేవలు : ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. మండలంలోని వేంపాడులో బుధవారం నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికే భవనాలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అనేక సంక్షేమ పథకాలు, వివిధ సర్టిఫికెట్లు ప్రజల ముంగిటకు చేరవేస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగుపల్లి నూకరత్నం, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, ఎంపీటీసీ సభ్యులు మధు, తహశీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వేంపాడు పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి అయినంపూడి మణిరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నక్కపల్లి, గొడిచెర్ల పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జిలు ఎలమంచిలి తాతబాబు, పొడగట్ల పాపారావు, నాయకులు సూరకాసుల గోవింద్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు .

కరువు జిల్లాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో పంట నష్టం కలిగిన జిల్లాలను కరువు జిల్లాల వారిగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామంలో వర్షాలు లేక ఎండిపోతున్న పంట పొలాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్నం పెట్టే రైతన్నను కాపాడలేని దౌర్భాగ్యం నెలకొందన్నారు. దేశానికి వెన్నుముక్కలాంటి రైతుకి తీవ్రమైన నష్టం జరుగుతుంటే వ్యవసాయ రాష్ట్ర యంత్రాంగం, ప్రభుత్వ అధికారులు పంట నష్టాన్ని పర్యవేక్షణ చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు ఎన్నికల పబ్లిసిటీల కోసం గ్రామాల్లో ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. రైతాంగంపై జాలి, దయ ఉంటే పంట నష్టం కరువు జిల్లాలుగా ప్రకటించాలని, పంట నష్టం కలిగిన ఎకరాకి రూ.30 నుండి 50వేల వరకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, నర్సీపట్నం టౌన్ రూరల్ మండల కార్యదర్శిలు జి.గురుబాబు, నల్లబెల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ముక్కతో చిత్రకళపై ఔత్సాహికులకు

19న ఆర్‌కె బీచ్‌లో శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఆదివారం ఉదయం ఏడుగంటలకు ఆర్‌కె.బీచ్ కాళీమాత మందిరం ఎదుట బొగ్గుముక్కతో చిత్రకళపై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ సీనియర్ మేనేజర్ సాగర్ గౌతమ్ను తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ఔత్సాహికులెవరైనా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని, గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నిపుణులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి శిక్షణ, మార్గదర్శకం చేస్తారన్నారు. ముందుగా పేర్లను నమోదు చేసుకున్న ఔత్సాహికులకు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఉచితంగా చిత్రరచనా సామగ్రి అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌ను సంప్రదించాలని సూచించారు.

జూ పార్కులోకి పేలుడు సామగ్రి నిషేధం

ప్రజాశక్తి - ఆరిలోవ : నాగుల చవితి రోజున జూలోకి సందర్శకులు ఎటువంటి పేలుడు సామగ్రి. నిషేధిత వస్తువులను తీసుకురావద్దని, అతిక్రమిస్తే జరిమానా తప్పదని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా అన్నారు. నాగుల చవితి రోజున సందర్శకుల పూజలకు వీలుగా సాధారణ సమయం కన్నా ముందుగానే ఉదయం 7.30 గంటలకు జూ తెరుస్తారన్నారు. సందర్శకుల సౌకర్యార్థం జూ పార్కులో బెంచీలు, డస్ట్‌బిన్స్, సందర్శకులు సేదతీరేందుకు కొత్త ల్యాండ్ స్కాప్ ప్రాంతాలు, ఆర్‌ఒ ప్లాంట్స్, పిల్లల ఆటస్థలాలు మున్నగు వివిధ రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

19న చంద్రమోహన్ సంస్మరణసభ

ప్రజాశక్తి- సీతమ్మధార : 900పైగా చిత్రాల్లో తన సహజ నటనతో నవరసాలు పండించి, తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన లెజెండరీ నటుడు చంద్రమోహన్ మరణం చిత్ర పరిశ్రమకు.తీరని లోటని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. ఈ నెల 19న సాయంత్రం ఆరు గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో చంద్రమోహన్ సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్ చిన్నాన్న కుమార్తె నాగరాజ కుమారి, సీనియర్ నటులు మిశ్రో...ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొని, చంద్రమోహన్‌కు నివాళులర్పిస్తారన్నారు ఈసందర్భంగా కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో చంద్రమోహన్ నటించి, పలు అవార్డులు పొందిన సీతామహాలక్ష్మి(1978)తెలుగు సినిమాను ప్రదర్శిస్తామన్నారు.

ధర్నా జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి వామనమూర్తి పిలుపునిచ్చారు. బుధవారంఅక్కయ్యపాలెం నరసింహనగర్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రావి కృష్ణ, ఎ.మహాలక్ష్మి నాయుడు,కె. శ్రీనివాసరావు, పి సాయికుమార్, కె. నర్సింగరావు పి సూర్యారావు, జి రాజా, ఎం రమణ, అనిల్, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

జెడ్‌పి వైస్‌చైర్మన్ బరిలో గిరిబాబు

ప్రజాశక్తి -పద్మనాభం: విశాఖపట్నం జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ పోటీ బరిలో స్థానిక జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు ఉన్నారు. ఈ మేరకు వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ జిలా అధ్యక్షుడు కోలా గురువులు నుంచి బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బి.ఫారం స్వీకరించారు. కార్యక్రమంలో పద్మనాభం ఎంపిపి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు కె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలోకూర్మన్నపాలెం కూడలిలో ఆదివాసీ ఉద్యమ నేత బిర్సాముండా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్టీల్ వైఎస్‌ఆర్‌టియూసి ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, ఆదివాసీ నేతలు డి. రమేష్ , కుంజా భిక్షమయ్య పాల్గొన్నారు

గీతం బిజినెస్ స్కూల్ డీన్‌గా ప్రొఫెసర్ రాజా

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలోని బిజినెస్ స్కూల్ డీన్‌గా అంతర్జాతీయ నిపుణుడు ప్రొఫెసర్ రాజా పి. పప్పు నియమితులయ్యారు. యుకె. లోని ఆస్టన్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబిఎతో పాటు పిహెచ్‌డి అవార్డు అందుకున్న ప్రొఫెసర్ రాజా పి. పప్పు, జాన్ ఫ్లడ్ టెలీకమ్యూనికేషన్ అవార్డుతో పాటు ఆస్టన్ విశ్వవిద్యాలయం 50వ వార్షికోత్సవ అవార్డును స్వీకరించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌తోపాటు సర్క్యులర్ ఎకానమీలో నిపుణులైన ప్రొఫెసర్ రాజా, లండన్ కేంద్రంగా ఉన్న స్కిల్లాన్టిక్ సంస్థకు సహ వ్యవస్థాపకుడిగా, డైరక్టర్‌గా వ్యవహరించారు.

ప్రొఫెసర్ రాజా పి.పప్పు

బ్రిటీష్ మాజీ ప్రధాని థెరిస్సామే, సర్ మాల్కమ్ గ్రాంట్లతో కలిసి పనిచేసిన అనుభవం ప్రొఫెసర్ రాజా పి. పప్పుకు ఉంది. కొన్నేళ్లుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాయం రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం డైరక్టర్‌గా వ్యవహరిస్తూ పలు భారీ పరిశోధనా ప్రాజెక్టులను భారతశాస్త్ర సాంకేతిక విభాగం నుంచి సాధించడంలో కృషి చేశారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్‌గా బోధన, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. గీతం నుంచి నిపుణులైన మానవ వనరులను దేశానికి అందించానికి అధ్యాపకులతో కలిసి సమిష్టి ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

రెండవ విడత సామాజిక సాధికార యాత్ర షెడ్యూల్

ప్రజాశక్తి -మధురవాడ : పార్టీలెన్ని కలిసి పోటీచేసినా రానున్న ఎన్నికల్లో వైసిపిదే విజయమని ఆ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో రెండవ విడత సామాజిక సాధికారయాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడత సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైందన్నారు. రాష్ట్రంలోని.175 నియోజకవర్గాల్లో ఈ నెల 30 వరకు రెండోవిడత బస్సుయాత్ర జరుగుతుందన్నారు. ఈనెల 16న బుధవారం నరసన్నపేట నుంచి మొదలై 30న అరకులోయలో ముగుస్తుందన్నారు. షెడ్యూల్ వివరాలివే.16న రాజాం, 18న విశాఖ తూర్పు, 20న ఎలమంచిలి, 21న పాతపట్నం, 22న విశాఖ దక్షిణం, 23న బొబ్బిలి, 24న పాలకొండ, 25న పెందుర్తి, 27న ఎచ్చర్ల, 28న నెల్లిమర్ల, 29న కురపాం, 30న అరకులోయలో ఉంటుందని తెలిపారు. ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణి,

వివరాలు వెల్లడిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు సమన్వయకర్త కెకె.రాజు, ఉపాధ్యక్షులు దామా సుబ్బారావు, కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, ద్రోణం రాజు శ్రీవాత్సవ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ రాహుల్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఆనందపురం: గ్రామీణ ప్రాంతాలలో తపాలాశాఖ అందించే విస్తృత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సీనియర్ సూపరెంటిండెంట్ ఆర్.రాహుల్ అన్నారు. మంగళవారం ఆనందపురం పోస్టాఫీస్‌లో 'మన ఊరు మన పోస్టాఫీస్' కార్యక్రమంలో భాగంగా పోస్టల్‌డిపార్ట్‌మెంట్ అందించే వివిధ రకాల పథకాలు, సేవలను వివరించారు.

2018లో ప్రారంభించిన పోస్టల్‌బ్యాంకింగ్ సేవల ద్వారా ఎటిఎం, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సంబంధమైన లావాదేవీలు, పోస్టల్ పాలసీలు, ఆధార్ సేవలను పోస్టాఫీసుల్లో అందిస్తున్నామన్నారు. కేవలం రూ.39 వార్షికప్రీమియంతో రూ.పది లక్షల వరకు ప్రమాదబీమా సౌకర్యాన్ని పోస్టల్ శాఖ అందిస్తోందన్నారు. హౌసింగ్, పర్సనల్ లోన్స్, వ్యవసాయ పరికరాలకు రుణాలను విశాఖ పోస్టల్ డివిజన్ పరిధిలోని దాదాపు 70 వరకు బ్రాంచ్‌ల్లో పొందవచ్చున్నార. శొంఠ్యాం పోస్టాఫీస్‌ను త్వరలోనే సబ్‌పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేసి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టల్ ద్వారా అందించే సేవలు, వివిధ బీమా, ఇతరత్రా పథకాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌ఎం సత్యనారాయణ, ఐపిపి మేనేజర్ శ్రీదేవి, ఆనందపురం బిపిఎం ఎంఎస్ హెచ్ కృష్ణ, సర్పంచ్ చందక లక్ష్మి, కార్యదర్శి శ్రీరామమూర్తి, సచివాలయ కన్వీనర్ సినగం రామారావు, చందక సూరిబాబు పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : వచ్చేనెల 1,2 తేదీలలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉక్కునగరం అంబేద్కర్ కళాక్షేత్రంలో నిర్వహించే బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు కోరారు. బుధవారం ఉక్కునగరం సి భవన్‌లో బాలోత్సవ్ ప్రత్యేక కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలోత్సవాల్లో భాగంగా 20 అకడమిక్ అంశాలతో పాటు 14 సాంస్కృతిక అంశాలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. అన్ని ప్రభుత్వ, మున్సిపల్, ప్రైవేట్, ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ మూర్తి, కె.సుశీల, ఆర్.నరసింహ, కెవి ప్రసాద్, జె.నూకరాజు, టి.చిరంజీవి, ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన ఓటరు నమోదు

ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : 11వ వార్డులో టిడిపి ఇన్‌చార్జ్ రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యంలో బుధవారం ఓటరు నమోదు, బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు పాల్గొన్నారు. వార్డులో అర్హులైన వారు స్వచ్ఛందంగా వచ్చి ఓటరు నమోదు చేసుకున్నారు.ఐ కార్యక్రమంలో ఆబోతుల అప్పలనాయుడు, మూది అప్పారావు, క్రిష్ణంరాజు పాల్గొన్నారు.

జగన్ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ప్రజాశక్తి -గాజువాక : అరాచక పాలనతో నవ్యాంధ్రను దోచుకుతింటున్న సిఎం జగన్ అండ్ కో కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడడమే తెలుగుదేశం, జనసేన ఉమ్మడి లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జనసేన అర్బన్ అధ్యక్షులు కోన తాతారావు స్పష్టం చేశారు. బుధవారం పాత గాజువాక టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ఆత్మీయ సమావేశంలో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ. రాష్ట్ర విశాల ప్రయోజనాలు దష్టిలో పెట్టుకొని చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తులపై చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని, దీనికి అందరం కట్టుబడి ఉండాలని తీర్మానించారు. జనసేన అర్బన్‌అధ్యక్షులు కోన తాతారావు మాట్లాడుతూ, అబద్దాలు, అవినీతి, విధ్వంసాలు, కుట్రలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ నుంచి ఆంధ్రాను కాపాడుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర పరిశీలకుడు కిమిడి రామ్మాలిక్, జనసేన, టిడిపి నేతలు గడసాల అప్పారావు. తిప్పల వెంకటరమణారెడ్డి. దల్లి గోవింద్‌రెడ్డి. గంధం వెంకట్రావు. ప్రసాదుల శ్రీనివాస్, పుచ్చ విజయకుమార్, బోండా జగన్‌పాల్గొన్నారు.